చిరునవ్వుల వెల ఎంత?

రాత్రి పన్నెండు గంటల సమయం. అలివేలు చాలా సేపటి నుంచీ పిల్ల వాడిని కళ్లు మూసుకునే జోకొట్టుతున్నది. ఏడుపు తగ్గగానే పిల్లవాడు నిద్రపోతు న్నాడనుకుని మంచి నీళ్లు తాగటానికి లేచింది. గదిలో బల్లదగ్గర దీపం ఇంకా వెలుగుతున్నది. శంకరం బల్లముందు కుర్చీలో కూర్చుని ఉన్నాడు.

"ఇంకా పడుకోలేదూ?" అంటూ మంచినీళ్లు తాగి మళ్లీ నిద్రలోకి జారింది. పగలంతా ఇంట్లో పనీ బైటి పనీ చేసిన ఆమె శరీరం. బాగా అలసిపోయి. రాత్రి భోజనం చెయ్యగానే నిద్ర కోరుతుంది.

పిల్లవాడు ఆమె విండు గర్భమ్మీద వేసినకాలు ఆమెను మళ్లీ మేల్కొలి పింది. ఇంకా దీపం వెలుగుతూనే ఉంది. శంకరం అలాగే కూర్చున్నాడు.

మెల్లగా లేచి చీర సర్దుకుని అతడి కుర్చీ వెనక నిలబడ్డ అలివేలుకు బల్ల మీద పెద్ద అక్షరాలతో వ్రాసిన ఉత్తర మొకటి కనబడ్డది. దృష్టి సారించి గబగబా చదివింది.

"అలివేలూ!

నేను నిద్ర మాత్రలు తిని ఆత్మహత్య చేసుకుంటున్నాను. తెల్లవారిన తరువాత బ్రతకదలచలేదు. పేకాటలో బాకీలుపడి వాటిని తీర్చటానికి ఇక్కడా అక్కడా అప్పులు చేశాను. వాటన్నిటినీ తీర్చటానికి మార్వాడీ దగ్గర అప్పు చేశాను. దాన్ని తీర్చటానికి ఆఫీసు డబ్బు వాడుకున్నాను. డబ్బు జమకట్టమనీ లేకపోతే ఉద్యోగం పోతుందనీ వార్నింగ్ ఇచ్చారు. అటువంటి వార్నింగులు నాలుగు తప్పుకు తిరిగాను. కాని నిన్నటిది చాలా కఠినంగా ఉంది. ఎలాగూ నేనా మొత్తం డబ్బుకట్టలేను. అయినా నలుగురిలో పరువు పోగొట్టుకోలేను. ఈరాత్రితో ఈ జీవితం అంతం కావాలి. ఇక నీ సంగతి. పిల్లలనూ నిండు గర్భంతో ఉన్న నిన్నూ మీ కర్మానికి వదిలిపెట్టి ఈ లోకం నుంచి పరారవుతున్నాను. నీవునావంటి

దానవు కాదు. ధైర్యం కలదానవు. నీవు పిల్లలను పెంచి పెద్దవాళ్లను చేస్తావన్న నమ్మకం ఉంది. ఇకపోతే నేను మా తమ్ముడికి ఇంతవరకు పంపుతున్న ఏభయి రూపాయలూ నీవు పంపక్కర్లేదు. వాడు చదువుకున్నా మానేసినా మా నాన్న బాధ్యత అది.

నీకు నా లోపాలు తెలుసు నా మనసూ తెలుసు. కనక నన్ను అపార్థం చేసుకోకు.

శంకరం"

ముచ్చెమటలు పోశాయి అలివేలుకు ఆ ఉత్తరం చదువుతుంటే. చటుక్కున ఆ ఉత్తరం లాక్కుని ముక్కలు ముక్కలుగా చింపి, బల్లమీద ఉన్న నిద్రమాత్రల పొట్లం అందుకుంది

ఉలిక్కిపడ్డాడు శంకరం. "నా ఆఫీసు కాగితం అలా చింపేస్తావేం? రేపు నాకు మాట రాదూ?" కనుబొమలు ముడివేసుకుంటూ దిగ్గున కుర్చీలోంచి లేచాడు.

అప్పటికే ఆ మాత్రలన్నీ మంచం దగ్గరగా ఉన్న ఎలుకల కన్నంలోపోసి. చెంబెడు నీళ్లు కుమ్మరించింది అలివేలు

"మీరింకా నిద్రపోలేదేం? రేపు ఆఫీసుకు వెళ్లరా?" ఆమె మాట కొంచెం కటువుగా ధ్వనించింది.

"ముఖ్యమైన కాగితం చింపేశావు! ఆఫీసు లెక్కలు వ్రాసుకున్న కాగితం మది" విసురుగా వెళ్లి గ్లాసెడు మంచినీళ్లు తాగాడు అక్కర్లేకపోయినా.

"ఆఫీసు కాగితమా?" వెటకారంగా నవ్వింది. "నేనూ నలుగురు పిల్లలూ ఏమయినా మీకక్కర్లేదు సరే-మిమ్మల్నే నమ్ముకుని ఇంజనీరింగు కాలేజీలో ఉన్న తమ్ముడి గతేమిటి? పెద్ద కొడుకు డబ్బు సహాయం చేస్తున్నాడు కదా అని. మీ నాన్నగారు పల్లెటూళ్లో పొలాల దగ్గర వాననక ఎండనక కష్టపడి మిగతా డబ్బు సమకూర్చగలననే నమ్మకంతో నిశ్చింతగా ఉంటే-వాళ్లను కూడా మాతోపాటే. నట్టేట ముంచాలనే కదూ మీ ఆలోచన - మీ నాన్నగారికి రెండు విధాలుగా మనస్తాపం కలిగించాలనా ఈ వయసులో? అసలు ఈ లోకం నుంచి పారిపోవాలనే ఆలోచన ఎందుకు వచ్చింది?"

వెర్రి చూపులు చూస్తూ నిలబడ్డ శంకరాన్ని నడిపించుకుంటూ మంచం దగ్గరికి తీసుకువెళ్లి బలవంతంగా కూర్చోబెట్టింది.

"ఇప్పుడు విప్పి చెప్పండి మీ కష్టాలేమిటో?" అతడి కళ్లల్లోకి చూస్తూ నిలవదీసి అడిగింది

మరొకప్పుడయితే ఆమె అలా నిలవదీసి అడగటాన్ని అతడు సహించేవాడు కాదు. ఇప్పుడతనికంతా అయోమయంగా ఉంది.

ఆమె కూడా అతడి ప్రక్కన సర్దుకుని కూర్చుంది. అతడు చేత్తో తల వెంట్రుకలు సర్దుకుంటూ "అయితే ఆ ఉత్తరం చదివావన్న మాట!" అన్నాడు తడబడుతూ.

"చదివాను కనకనే మీ ఆలోచనలు తెలిశాయి. అయితే ఆత్మహత్య ప్రయోజకత్వ మనిపించుకుంటుందా?" ఆమె కంఠం రుద్ధమయింది.

"ఏం చెయ్యను? అది పాడుపని అని తెలుసు. పిరికితనమనీ తెలుసు. కాని రేపు పదకొండు గంటలకల్లా ఆఫీసులో డబ్బుకట్టాలి. ఎంతో తెలుసా? రెండువేల ఐదువందల రూపాయలు. కట్టకపోతే జవాన్లకు కూడా అలుసయి పోతాను. చావటాని కయినా ఒప్పుకుంటాను గానీ అవమానాన్ని సహించలేను" రెండు చేతులతో తలపట్టుకున్నాడు శంకరం.

సరిగ్గా ఇటువంటి పరిస్థితే నాలుగేళ్ల క్రిందట వచ్చింది. అప్పుడు అది ఐదువందల రూపాయల అప్పు. అధికవడ్డీతో వెయ్యి రూపాయలు దాటింది. అరవ్వి వాడి చేతిలో శంకరం ప్రాణంపోయేటంతపని జరిగింది. అది కళ్లతోజూసిన అలివేలు తన మెడలో ఉన్న గొలుసు ఇంటి యజమాని దగ్గర తాకట్టుపెట్టి కొంత సొమ్ము, చేతిగాజులు అమ్మి కొంతసొమ్ము జతచేసి బాకీతీర్చింది. తాకట్టు బాకీ తీర్చటం కోసం ఆ వాడలోఉన్న చిన్నస్కూల్లో హిందీ టీచర్‌గా పనిచేయటం మొదలుపెట్టింది. కళ్లతో చూశాడుగాని-శంకరం "ఆ బాకీ ఎట్లా తీర్చావు అలివేలూ?" అని నోటితో అడగలేదు.

అలివేలు ఆ స్కూల్లో టీచరుగా ఉండిపోయింది నూటపాతిక రూపాయలకు రసీదు వ్రాయించుకుని ఎనభై రూపాయలు చేతిలో పెడతారు. అదే పెన్నిధి

దొరికినట్టుగా భావించుకుని పని చేస్తున్నది. ఏటా కాన్పు. పురుడు వచ్చిన నెల రోజులు ఇంట్లో ఉంటుంది. తరువాత ఎడపిల్లలతోపాటు పసిపిల్లను కూడా వెంట తీసుకు వెళ్లుతుంది. పై పిల్లలను చదవకపోయినా ఆ స్కూల్లో చేర్పించింది. ఇంటి పని, స్కూలు పనీ కాకుండా అలివేలు దారాలతో రకరకాల లేసులు, ఊలుతో క్రొత్త కొత్త నమూనా స్వెట్టర్లు అల్లుతుంది చాలా మంది ఆమె యింటికి వచ్చి కొనుక్కుంటారు ఆమె శంకరం ఆఫీసుకు వెళ్లేవరకూ ఇంట్లోనే ఉంటుంది. తిరిగి అతడు రాత్రి ఏ పన్నెండు గంటలకో వచ్చేసరికి పిల్లలతో ఇంట్లోనే కన బడుతుంది.

శంకరం ఇంట్లో చాలా తక్కువ మాట్లాడుతూ అంటీ అంటనట్టుగా ఉంటాడు. ఇంటి సంగతులు పట్టించుకోడు. తను ఇంట్లో ఇచ్చే డబ్బు చాలదని తెలుసు. పిల్లల ఖర్చులకూ, మందులకూ, చాలటంలేదని అలివేలు అంటుందేమో నని ఒక ప్రక్క సందేహిస్తూ జంకుతూ ఉంటాడు. పైపై పలకరింపులతో కాల క్షేపం చేస్తాడు. ఉదయం ఒక గంటసేపు అలివేలు వంటప్రయత్నంలో ఉన్నప్పుడు పిల్లలను పలకరిస్తాడు. చిన్నా, చిట్టి, నాన్నా, అమ్మా అంటూ భుజాల మీదికి ఎక్కించుకుంటాడు వీపుమీద ఎక్కించుకుంటాడు. వాళ్లను నవ్విస్తాడు కడుపు నొప్పి వచ్చేవరకు ముద్దులు పెట్టుకుంటాడు—పెట్టించుకొంటాడు.

అలివేలు ఆశావాది. ఎంత హీనస్థితిలో ఉన్నా ఆమె దైన్యంగా ఆలోచిం చదు. పిచ్చి పిచ్చి ఆలోచనలకు బదులుగా గట్టి ఆలోచనలు చేస్తుంది వాటిని ఆచరణలో పెట్టటానికి ఆలస్యం చెయ్యదు. శంకరానికి వచ్చే నాలుగువందల రూపాయల జీతంతో నికరంగా ఆమె చేతిలోకి వచ్చేవి రెండే వందలు. మిగతా వాటి సంగతి ఆమె ఎత్తదు. ఏవో పై బదుళ్ళు ఉన్నాయని పసికట్టింది. పిల్లలనూ సంసారాన్ని దృష్టిలో ఉంచుకొని ఎప్పుడయినా మాటవరసకు ఆ ప్రశంస తెస్తూ ఉంటుంది. అప్పుడప్పుడు నిప్పురవ్వల్లాంటి మాటలను నవ్వుతూ రువ్వుతుంది. అది ఒక్కొక్కసారి హాస్యంగా తేలిపోతుంది.

"ఈ నలుగురు పిల్లలు రేపు పుట్టబోయే బిడ్డతో ఐదు మంది వీళ్లంతా ఏం చదువుతారు? ఏం తింటారు?" ఒక రాత్రిపేళ ఇంటికి వచ్చిన శంకరానికి వడ్డిస్తూ అంటుంది అలివేలు.

"అదే అలివేలూ నేనూ ఆలోచించేది, పిల్లల సంఖ్య పెరుగుతోంది. ఎక్కడ చూసినా ఇద్దరు లేక ముగ్గురు అన్న వినాదం వినబడుతూనే ఉంది. చెయ్యి దాటిపోయింది కాని ఇకనుంచి చూడు నేను కొత్త శంకరాన్నయిపోతున్నా" అంటాడు

ఆ మాటలకు ఆమెకు నవ్వురాదు, సంభాషణ మరి సాగదు.

అటువంటి పరిస్థితులకు అలవాటు పడిన అలివేలు తెగేవరకుతాడుబిగించదు. అతడు ఇంట్లో పోరు పడలేక అసలే ఇంటికి రాకపోతే? ఆ రెండు వందలు కూడా ఇవ్వకపోతే? మనసును మళ్లించుకుంటుంది.

అలివేలు కష్టజీవి. బాల్యం నుంచీ తండ్రి ఇంటికి ఇచ్చే డబ్బు చాలా స్వల్పంగా ఉండేది రకరకాల వ్యసనాలు ఉండేవి ఆయనకు. ఈ ఒక్కకూతుర్ని చాలా గొప్పగా పెంచాలని తల్లి ఆరాటపడేది. ఆమె చీకటితో లేచి ఇడ్లీలూ, పచ్చడీ చేసి అక్కడికి ఒక ఫర్లాంగు దూరంలో ఉన్న ఆఫీసర్ల కాలనీలో ఇచ్చి రమ్మని అలివేలును పంపేది.

"వచ్చావా అలివేలు! ఇవాళ ఆలస్యమయిందేం?"

"నీ కోసం కాఫీ అయినా తాగకుండా కిటికీ దగ్గర నిలబడ్డాను"

"అమ్మయ్య అలివేలు ఇడ్లీ తెచ్చిందర్రా—త్వరగా ప్లేట్లు తీసుకరండి."

ఇలా ఆమెకు స్వాగతం పలుకుతూ చేతిలో నుంచి పొట్లాలు లాక్కుపోతూ ఉండేవారు. రెండేసి ఇడ్లీలు ఒక పొట్లం కట్టి పంపేది తల్లి. అలివేలు ఆ పొట్లాలు ఇళ్లల్లో ఇచ్చేది. ఖాతా పుస్తకంలో వ్రాయించుకుని పంపేవారు. కొందరు అలివేలుకు కాఫీ కూడా ఇచ్చేవారు. మొదట పదిహేను ఇళ్లవరకూ ఉండేవి-క్రమంగా నూరు ఇళ్లకు పైగా పెరిగాయి.

ఒకనాడు అలివేలు ఇడ్లీగిన్నె చంకబెట్టుకుని వెళ్లుతుంటే ఆ కాలనీలో ఒక గృహిణి పాలకోసం వాకిట్లో నిలబడి పిలిచింది. పిల్లలకు ఇడ్లీలయినా పెడదామని లోపలికి తీసుకెళ్ళి పది పొట్లాలు తీసుకుంది. అంతలో "అమ్మా నాకో ఇడ్లీ?" అన్నమాట వెనుక నుంచి వినబడ్డది. ఏ చిన్న పిల్లలో అడుగుతున్నారు ముద్దు ముద్దుగా అనుకొని వెనక్కు తిరిగి చూసింది.

ఆమెను చూడగానే ఒక నవ్వు నవ్వి బల్లమీద ఉన్న ఇడ్లీ పొట్లం అందు కున్నాడు ఆ ఇంటి పెద్ద కొడుకు. ఆలా ఆ రోజు మొదలుకొని ఆమె వచ్చే వేళకు స్నానం చేసి డ్రెస్సు వేసుకొని పుస్తకాలు చేతబట్టుకొని వాకిట్లో నిలబడేవాడతడు. ఆమెను చూడగానే తన మామూలు నవ్వు నవ్వి లోపలికి వెళ్లేవాడు. అతడి పేరు శంకరమని తెలుసుకుంది అలివేలు.

అలివేలు పద్దెనిమిదేళ్లు దాటిన పిల్ల, వాయిల్‌చీర కట్టుకుని పొట్టి జడలతో విపరీతంగా అలంకరించుకోకుండా సామాన్యంగా ఉన్నట్లు కనబడుతుంది కాని చూసిన కొద్దీ ఆమె ముఖం. కళ్ళు నోరు ఎదటివారిని ఆకర్షించటం మొదలు పెడతాయి. ఆమెతో మాట్లాడిన కొద్దీ ఇంకా మాట్లాడాలనే అనిపిస్తుంది పని ఉన్నా లేకపోయినా అలివేలును నిలబెట్టి ఈ మాట ఆ మాట అడుగుతూ ఉంటారు ఆయిళ్లల్లోని గృహిణులు.

శంకరం నవ్వుకు మొదట తలవంచుకున్నా తరువాత తరువాత అతడి నవ్వు ఆమెను ఆకర్షించటం మొదలు పెట్టింది. ఆ నవ్వుతో ఆమెలోని ఉత్సాహం ఇనుమడించేది. ఆమె డొమిస్టిక్ సైన్సు కాలేజిలో డిగ్రీ తీసుకుని ఉద్యోగం చేయాలన్న ఆశలు పెంచుకోవటం మొదలు పెట్టింది. గాని ఆమె కోరిక తీరక ముందే తల్లి చనిపోయింది. తండ్రి ఇంటికి రావటమే మానుకున్నాడు. ఆమెకు ఆ వాడలోని ముసలమ్మలే పెద్దదిక్కు. ఒక ప్రైవేటు స్కూల్లో టీచరుగా చేరి పోయింది. కాలేజీలో చదువు సాగించలేక.

ఆఫీసర్ల కాలనీకి నాలుగేళ్ళుగా ఇడ్లీ సరఫరా నిలిచిపోయింది.

ఆ రోజు బస్సుకోసం గంటకు పైగా నిలబడ్డది అలివేలు. అక్కడనిలబడ్డ వాళ్లంతా చెమటలు తుడుచుకుంటూ ఉస్సురంటూ చెట్టు కింద నిలబడ్డారు.

"బస్సు ఇవాళ రాదండీ" అంటున్నారెవరో అలివేలు వెనుకనుంచి.

టైమయిపోతున్నదన్న చికాకులో ముఖమంతా ఎర్రగా చేసుకొని వెనక్కు తిరిగి చూసింది అలివేలు.

అందమైన చిరునవ్వుతో, కళ్లు చికిలిస్తూ ఓ యువకుడు చేతిగుడ్డతో మెడ తుడుచుకుంటున్నాడు.

"మీకెలా తెలుసు బస్సురాదని?" చెట్టు కింద నిలబడ్డ గుంపులో నుంచి ఒక్కొక్కరే అతడిని సమీపించారు.

"మీకింకా తెలియదా? మన సోదరులు ఇవాళ ఉదయమే పెట్రోలుపోసి రెండు బస్సులు తగలబెట్టేశారు. అందుకని ఇవాళ బస్సుల రాకపోకలునిలిపేశారు" అన్నాడు.

ఒక్కొక్కరే ఎవరిదారివారు వెళ్ళిపోయారు. అలివేలు స్కూలుకు ఎలా వెళ్లాలని ఆలోచిస్తూ నిలబడిపోయింది. అయినా ఊళ్లో ఇంత అల్లరిగా ఉంటే స్కూలు తెరిచి ఉంటుందా? ఏమో? అనుకుంటోంది.

"ఇంకా ఎందుకు ఎండలో నిలబడటం? హాయిగా ఇంటికి వెళ్లక?"

ఆమె తల ఎత్తింది ఆలోచనలు తెగక మళ్లీ అదే నవ్వు.

"మీరు ఇడ్లీలు తీసుకురావటంలేదు. మా అమ్మ కూడా లేదు. నేను ఏం తిని ఆఫీసుకు వెళ్లాలి?"

ఈ నాలుగేళ్లల్లో వాళ్ల యింట్లో కూడా చాలా మార్పులు వచ్చాయన్నమాట కాలేజి చదువు అయిపోయి ఆఫీసుకు వెళ్లే వరకూ వచ్చిందన్నమాట అతడి పని. అలివేలు మాట్లాడకుండా తలవంచుకుని వెళ్ళిపోయింది. అలా రోజూ ఆ చెట్టు క్రింద బస్సుకోసం ఆమె, ఆదారిన ఆఫీసుకు వెళ్లుతూ అతను—ఇద్దరూ కలుసుకునే వారు. నవ్వుతూ పలకరించుకునేవారు.

అలివేలు టీచరుగా పనిచేస్తూ ప్రైవేటుగా చదివి బి. ఏ. ప్యాసయింది. హిందీ పరీక్షలు వ్రాసి డిగ్రీ తెచ్చుకుంది. ప్రతి రోజూ అతడిని కలుసుకొన్న తరువాత ఆ నవ్వుతో అతడిచ్చే ధైర్యమే ఆమెను ముందుకు నడపించుకొని పోవటం మొదలుపెట్టింది

తన ఒంటరితనానికి ఆ నవ్వును జోడించుకుందామని ఆమెలో కలుగుతూ వచ్చిన కోరికను ఆమె పెంపొందించలేకపోయింది. నక్క ఎక్కడ? నాగలోక మెక్కడ? కాని అతడు తండ్రిని ఒప్పించి ముందడుగువేసి తనను జోడుగా చేసుకున్నాడు.

పెళ్లి అయిన ఈ ఆరేళ్లల్లో ఆ నవ్వు మాసిపోలేదు. సాంసారికంగా ఎన్నో కష్టాలు వచ్చాయి. పిల్లలకు జబ్బు చేసింది. నాలుగేళ్ల ఎదిగిన పిల్ల చనిపోయింది. ఏడాది నిండకుండానే పిల్లవాడు రాలిపోయాడు. వచ్చే జీతం చాలటంలేదు. మిన మిన లాడుతూ ఉండే అలివేలు చిక్కి నల్లబడ్డది. ఎంత పెద్ద విషయాన్నైనా ప్రశాంతంగా ఆలోచించే ఓర్పు శంకరంలో తగ్గటం మొదలుపెట్టింది. అతడు పలాయన సూత్రాలను అన్వేషించటం మొదలుపెట్టాడు.

కాని అతడి పెదవుల మీద ఆ అందమైన నవ్వు మాసిపోలేదు. ఆ నవ్వును చూసి ప్రజ్వలించే ఆమె కళ్లల్లోని కాంతి తరిగిపోలేదు.

ఆలోచిస్తూ అతడి ప్రక్కన కూర్చుని అలివేలు ఆ నవ్వుకోసం అతడి ముఖంలోకి చూసింది.

"ఏమయిందానవ్వు? తనను ముందుకు నడిపించే నవ్వు-ఈ సంసార సాగరంలో భయం గొలుపుతూ తల ఎత్తి మొసళ్లవంటి కష్టాల నుండి కూడా తప్పించి ఇన్నాళ్లూ మనగలిగిన ఆ నవ్వు ఏమయింది ఇవాళ?'

ప్రక్క భాగంలో నుంచి మూడు గంటలు కొట్టిన చప్పుడు వినబడ్డది.

చూస్తూ ఉండగానే తెల్లవారిపోతుంది కాబోలు. ఈ చిక్కు ఇప్పుడు విడదీయకపోతే ముళ్లుపడినదారం తెగిపోతుంది. చివ్వున లేచింది అలివేలు. అతడి కెదురుగా నిలబడి "శంకరం! ఇటు చూడు" అన్నది

పెళ్లికాక ముందు ఆమె అతడిని శంకరమనే పిలిచేది. ఏకవచనములో సంబోధించేది. ఆ పిలుపుకూ ఆ ఆప్యాయతకూ అతడిలో ఉత్సాహం పొంగులు వారేది. కాని-పెళ్లి అయిన తరువాత అలా పిలవటం మానేసింది అలివేలు. ఇవాళ ఆ పిలుపుకు అతడు దిగాలుపడ్డ ముఖమెత్తి ఆమె కళ్ళల్లోకి చూశాడు.

పరవాలేదు, తన పిలుపుకున్న వేడి తగ్గలేదనుకుంది అలివేలు. "ఇవాళ మనకు తెల్లవారుతుందా?" అన్నది.

"ఏమో" అన్నాడు అయోమయంగా.

"తెల్లవారగానే నన్ను హాస్పిటల్‌కు తీసుకెళ్ళాలి శంకరం" ప్రాధేయ పడుతూ అడిగింది.

"హాస్పిటల్‌కా! ఎందుకు?" అసందర్భంగా ఆమె మాట్లాడుతోందను కొని కనుబొమ్మలు ముడివేస్తూ తల పైకెత్తాడు.

"ఎందుకంటే ఏం చెప్పను శంకరం? మరో పాపాయిని ఎత్తుకోవటానికి నేనే నిన్ను నిద్రలేపి చెప్పాలనుకుంటున్నా, ఇంతలోకి ఆ మాయదారి ఉత్తరం గొడవొకటి వచ్చిపడ్డది"

"అలివేలూ హాస్యం చమత్కారం చాలుగాని వెళ్లిపడుకో"

"వాటికే ఆ నవ్వు విరిసేది. దానికోసమే ఇదంతా"

"నేనెంత బాధలో ఉన్నానో నీకు తెలుసు. హాస్యానికి వేళాపాళా ఉండాలా వద్దా?" కసురుకున్నాడు.

అరగంటసేపు అలా మౌనంగా కూర్చున్నారు ఇద్దరూ నేలచూపులుచూస్తూ.

అలివేలుకు ఆలోచనలు తెగటంలేదు తను వెళ్లి పడుకుంటే తలుపు గడియ తీసుకుని వెళ్లిపోతాడేమో! ఆమె మనసులో మెదిలిన భయానికి అతడి చేతిని తన రెండు చేతుల మధ్య బంధించింది.

"శంకరం"

ఆ పిలుపుకు అతడి ప్రాణం లేచివచ్చినా తల ఎత్తైనా చూడలేదీసారి.

"నేను ఆ బాకీ ఎలాగో తీరుస్తాను. పదకొండు గంటలకు డబ్బు తెచ్చి నీ చేతిలో పోస్తానుగాని——ఇంక ఎప్పటికీ ఇటువంటి పనిచేయనని మాట ఇవ్వు."

"ఎటువంటి పని?" తల వంచుకునే ప్రశ్నించాడు.

"ఆదే-నిద్రమాత్రలు తినటంవంటి పని"

"తిననను కో, కాని-ఆ వెధవ చచ్చు బ్రతుకు బ్రతికేకంటే ప్రాణం తీసుకుంటేనే బాగుంటుందనిపిస్తోంది."

"ఇంక-వెధవ బ్రతుకు ఎందుకవుతుంది? బాకీ తీరిపోతుందిగా? ప్రాణం పోగొట్టుకోటం ఎందుకు?"

ఈ ప్రశ్నలకు జవాబు అతడి దగ్గర అప్పుడు లేదు. కాని మనసులో సముద్ర ఘోషలాంటిది బయలుదేరింది. ఈ అమాయకురాలికి ప్రపంచమంటే ఏమిటో తెలియదు. ఆడవాళ్ల ప్రేమతో త్యాగంతో ప్రపంచాన్నంతా కొనెయ్యాలనుకుంటారు. అలవాట్ల యొక్క ప్రభావం మనిషి మీద ఎంత ఉంటుందో - వాటికి మనిషి ఎంతగా బానిస అయిపోతాడో తెలుసుకోలేరు. భార్యల ప్రపంచమంతా ఇంటి నాలుగు గోడల మధ్యగా ఉంటుంది. తనతో పని చేసే నారాయణ తనను చదరంగంలోని పావుగా వాడుకుని ఈ ఊబిలోకి దింపే వరకూ తనూ ఈ లోకంలోని మాయామర్మం తెలియని అలివేలు వంటివాడే. తాను ఊబిలోకి రోజు రోజుకూ ఇంకా ఇంకా దిగబడిపోతున్నాడు. తను ఇంక పైకి లేవలేడు, కాగా తనకు చెయ్యి అందించిన వాళ్లకు కూడా ఊబిలోకి లాగేస్తాడు.

పసిపాపలాంటి అలివేలుకు ఈ ఊబి సంగతి చెబితే మరి బ్రతకదు. పిల్లలకు ప్రకృతి సమకూర్చిన ఆసరా కాస్తా పోతుంది. పోకూడదు. అలివేలు తల్లీ తండ్రీ తానే అయి పిల్లల పోషణ భారం వహించాలి

ఏదో ఒక నిశ్చయానికి వచ్చినట్టు "నాలుగు కావచ్చింది ఇప్పుడయినా మనము పడుకోకపోతే తెల్లవారి లేవలేము. పడుకుందాం పద, అసలే లేవలేని దానవు" తను లేచి ఆమెకు తన చేయి అందించాడు.

"ఒక చేయి చాలదు. రెండు చేతుల ఆసరా కావాలి" అతడిని నవ్వించాలన్న ప్రయత్నం మానలేక అన్నది.

అతడు రెండు చేతులు అందించాడు. ఆమె లేచింది. ఇద్దరూ పడకలు చేరారు. అలివేలుకు కన్నుమూత పడలేదు. కళ్లు తెరచుకుని తలుపు వంక చూస్తూ ఆలోచిస్తున్నది. ఎనిమిది గంటలకల్లా బ్యాంకుకు వెళ్లి డబ్బు తీసుకుని ఆఫీసుకు ముందరే వెళ్లి శంకరం డబ్బు కట్టేటట్లు చెయ్యాలి. ఈ చిన్న లోపం తప్ప శంకరంలో ఏం లోటు ఉన్నది? దీనిని తాను సరిదిద్దగలిగితే తన సంసారానికేం లోపం? భార్యలు చాలామంది భర్తలను అర్థం చేసుకొని వాళ్లకు తమ సహాయ సహకారాలను అందజేయకుండా సంసారాలను పాడు చేసుకుంటారు. తమ పడుతున్న బాధను కళ్లారా చూస్తున్న శంకరం మళ్లీ ఇటువంటి పని చేయడు.తనూ శంకరం పెళ్లయిన కొత్తలో ఉన్నట్టు ఒకరికోసం ఒకరు ఎదురు చూస్తూ బ్రతక

వచ్చు. తన ప్రాణప్రదమయిన ఆతడి చిరునవ్వును ఎప్పుడూ చూస్తూ ఉండొచ్చు. అందరివలె వంతాలకుపోయి ఆ చిరునవ్వును పోగొట్టుకోను. దాన్ని జీవితాంతమూ నిలుపుకోవాలి. తనకా నవ్వు కావాలి. అది లేకపోతే బ్రతకలేదు. తన జీవమది.

ఆరు గంటలు కొట్టగానే లేచి ఇంటిపని చేసుకుని వంట చేసింది. ఎనిమిది గంటలకల్లా పిల్లల స్నానాలూ భోజనాలూ పూర్తిఅయ్యాయి. ప్రక్క యింటో పిల్లలను ఉంచి బయలుదేరింది.

"ఎక్కడికి బయలుదేరావు?" స్నానం చేసి తల దువ్వుకుంటున్న శంకరం అడిగాడు.

"ఇప్పుడే వస్తాను"

"పిల్లలు ఏరి?"

"నేను వచ్చేవరకూ ప్రక్క యింట్లో ఉండమన్నాను"నర్ది చెప్పబోయింది.

"నేను రాత్రి ఆలస్యంగా వచ్చాను.వాళ్లతో మాటాడనేలేదు పిలుచుకురా" చాలా మామూలుగా అన్నాడు.

"ఇదేమిటో క్రొత్త కోరిక" అనుకుంటూ వాళ్లను తీసుకురావటానికి వెళ్తూ రాత్రి చెయ్యబోయిన పిచ్చి పనికి పశ్చాత్తాపపడుతున్నాడనుకొని తృప్తిగా నవ్వు కుంది అలివేలు.

శంకరం పిల్లలను ఎత్తుకున్నాడు. ముద్దులు పెట్టుకున్నాడు. వాళ్లచేత పెట్టించుకున్నాడు. మాటలు రాని పిల్లలచేత కూడా ముందు ముందు ఏం చేయ బోవాలో అడిగి తెలుసుకున్నాడు.

అలివేలుకు కళ్ల నీళ్లు వచ్చాయి. ఎంతగా మారిపోయాడు? పిల్లలఅదృష్టం బాగుంది కనుకనే తనకు వేళకు మెలకువ వచ్చింది. లేకపోతే ఇంకేమయినాఉందా? తనూ, పిల్లలూ-ఇంక ఆలోచన సాగక కళ్లు తుడుచుకుంది.

"అలివేలూ నేను ఆఫీసుకు వెళ్తాను. నేనేదో తంటాలుపడి జీతంలో నెల నెలకూ కొంత సొమ్ము పట్టుకునేటట్టుగా ఏర్పాటు చేస్తాను. నీవేం బాధపడకు" అన్నాడు తలవంచుకుని.

గబగబా అడుగులు వేస్తూ వాకిటి వరకూ వెళ్లి మళ్ళీ లోపలికి వచ్చాడు. గోడకానుకొని తననే చూస్తూ నిలబడి ఉన్న అలివేలును కళ్లు విప్పుకుని చూశాడు పిల్లల మీదికి దృష్టి సారించి 'టాటా' అంటూ గిరుక్కున వెనక్కు తిరిగాడు.

అలివేలు బరువుగా నిట్టూర్చి పిల్లలను మళ్లీ పక్కయింటికి చేర్చి బ్యాంకుకు వెళ్లి డబ్బు తీసుకుని ఆఫీసుకు బయలుదేరింది. అప్పటికి పదిగంటలు దాటాయి.

అలివేలును చూపి గతుక్కుమన్నాడు నారాయణ. శంకరం ఇంకా రాలేదని చెప్పాడు. అరగంట-గంట గడిచింది. అలివేలుకు శంకరం కోసం ఎదురుచూస్తూ గుండె దడదడ లాడటం మొదలుపెట్టింది ఆలోచనలు ఆమెను చుట్టుముట్టడం మొదలుపెట్టాయి. అంతవరకూ భోజనంలేదు. కడుపులో ఏదో ఆరాటంగా ఉంది. చివ్వునలేచి ఆఫీసరు దగ్గరికెళ్లి సంగతంతాచెప్పి డబ్బుకట్టి రసీదు తీసుకుంది. ఒక్క అంగలో రిక్షా తీసుకుని హుసేనుసాగరు కట్టమీదికి తొందరగా పోనివ్వమన్నది.

పరీక్ష తప్పిన విద్యార్థినీ విద్యార్థులకూ భగ్నప్రేమికులకూ అభయ ప్రధాన మిస్తుంది హైదరాబాదు సికిందరాబాదు జంటనగరాల మధ్యఉన్న హుసేనుసాగరు. సాయంత్రంకాగానే దీపతోరణాలు నదీజలాలలో ప్రతిఫలించి అందంగా కనబడుతూ ఉంటాయి. నదిలో సగం మునిగిన బోటులాంటి క్లబ్బు సాయంత్రం కాగానే సందడి చేస్తూ ఉంటుంది అర్ధరాత్రి వరకూ, ఆంధ్రప్రదేశ్ అవతరించిన తరువాత కట్టదగ్గరగా ఒక మంచి పార్కు ప్రజల నాకర్షిస్తున్నది. ఆత్మహత్యలు జరగకుండా పోలీసు పహరా దివారాత్రాలు సాగుతున్నది. అయినా వాళ్ళ కళ్ళు కప్పి ఎవరో ఒకరు ఏ మూలనుంచో నీళ్ళలోకి కట్టమీదనుంచి దూకి ఆత్మహత్య చేసుకుంటూనే ఉన్నారు

అలివేలు కట్టదగ్గరి కొచ్చేటప్పటికి ఒడ్డుమీద ఇద్దరు పోలీసుల కబంధహస్తాల మధ్య ఒకయువకుడు గుంజుకుంటున్నాడు ఆమె గుండెలవిసిపోయాయి. ఆ దృశ్యం చూడగానే అతడు శంకరమే అయిఉంటాడు. ఎంత ప్రయత్నము చేసినా అతడు తన బుద్ధిని మరల్చుకోలేదన్నమాట. రాత్రి ఆత్మహత్య చేసుకోబోయి తనకు పట్టుబడ్డాడు. ఇప్పుడు పోలీసులకు పట్టుబడిపోయాడు. ఇందుకే కాబోలు తన కళ్ళల్లోకి చూడలేకపోయాడు తనూ పిల్లలూ అదృష్టవంతులే. ఇంక శంకరాన్ని ఒక్క నిమిషమయినా విడిచి ఉండకూడదు. తననూ పిల్లలనూ అన్యాయం చెయ్యటమంటే మాటలనుకుంటున్నాడేమో ?

కట్టమీద నుంచి ఒడ్డుకు పోవాలంటే చుట్టు తిరిగిపోవాలి. ఆ ప్రయత్నంలో కాళ్లు జారుతున్నా గబగబా అడుగులు వెయ్యటం మొదలుపెట్టింది. ఆమె ఒడ్డుకు చేరుకునేటప్పటికి పోలీసుల చేతులలోనుంచి ఆ యువకుడు తప్పించుకుని నీళ్ళల్లోకి జారుకున్నాడు. "శంకరం శంకరం" అంటూ కేకలు పెడుతూ అలివేలు కూడా వచ్చి ఆవేశంతో నీళ్ళలోపడి జారిపోయింది

"ఇదేమిటి? ఈ ఆడది ఎక్కణ్ణుంచి వచ్చింది?" పోలీసులు అయోమయంగా చూసి ఇద్దరు గజ ఈతగాళ్ళను పంపించారు వాళ్ళను ఒడ్డుకు చేర్చమని.

ఇదంతా క్షణాలమీద జరిగిపోయింది. నీళ్ళలోపడటానికి పోలీసు పహారాతో వీలుపడక సమయంకోసం కట్టమీద నిలబడి ఎదురుచూస్తున్న శంకరం ఎవరో స్త్రీ నీళ్ళల్లోపడ్డదన్న కేకలకు అదిరిపడి కట్టదిగి గుంపులోకి దూరాడు.

పోలీసు చేతికర్రలు తిప్పుకుంటూ ఇటునుంచి అటూ అటునుంచి ఇటూ పచార్లు చేస్తున్నారు. జనాన్ని ఒక హద్దుదాటి రానివ్వటంలేదు గజ ఈతగాళ్ళు అప్పుడప్పుడు తలలు చేతులూ నీటిపైకి తేల్చి కనబడలేదని సైగలు చేస్తున్నారు

గుంపులోనుంచి కొందరు వెళ్ళిపోతున్నారు. కొందరు కొత్తగా వచ్చి చేరుతున్నారు. ఆందోళనతో బీటలువారిన గుండెతో శంకరం నిలబడి ఆ స్త్రీ ఎవరయి ఉంటుందా అని ఎదురు చూస్తున్నాడు. అతడి దేహం కంపించిపోతున్నది. పెదవులు ఎండిపోయాయి

సాయంకాలము ఆరుగంటలు కావచ్చింది. పోలీసులూ, గుంపులో ప్రజలూ అలిసిపోయారు. ప్రతిరోజూ ఎవరో ఒకరు ప్రాణాలు తీసుకుని తమ ప్రాణాల మీదికి తెస్తారని విసుక్కుంటున్నారు పోలీసులు

గజ ఈతగాళ్లు చీకట్లు నలుప్రక్కలా ఆవరించక ముందు దీపాలతోరణాలు తళతళా మెరవక ముందు ఆస్త్రీ దేహాన్ని ఒడ్డుకు చేర్చారు

"నిండు గర్భిణి" పోలీసులు దగ్గరికి చేరారు

"అలివేలు! అలివేలు!" పిచ్చివాడిలా పరుగెత్తుకుంటూ వచ్చాడు శంకరం. ఆమె తలను తొడమీద పెట్టుకున్నాడు. నన్ను ఆత్మహత్య చేసుకోవద్దని

వారించి నీవు ప్రాణాలు తీసుకున్నావా అలివేలూ! నేనిక్కడే ఉన్నాను. చూడు నా వంక! నేను లేకపోతే నీవు పిల్లలను పెంచగలవు. కాని నీవు లేకపోతే నేను పిల్లలనుపెంచలేను అలివేలూ! ఎందుకిలా చేశావు?'' తలబాదుకున్నాడు శంకరం.

అయ్యో! తను ఆమెమనసు నెందుకు కనిపెట్టలేకపోయాడు? తను వట్టి దురదృష్టవంతుడు. ఆమె చల్లటి చేతులను కళ్లకద్దుకుంటున్నాడు. జుట్టు పీక్కొని ఏడుస్తున్నాడు.

''చిరునవ్వు వెల ఎంత?
సిరులేవీ కొనలేనంత!''

హుస్సేన్ సాగరం కట్ట మీద ఈ దృశ్యాన్ని చూస్తూ నిలబడ్డ యువకుడి చేతిలో ఉన్న ట్రాన్సిస్టరు యుగళ గీతాన్ని ప్రసారం చేస్తున్నది.

ఆదృశ్యం చూసి ఈపాట విన్న జగచ్చక్షువు అప్పుడు కనుమరుగయ్యాడు.

(ఆంధ్రప్రదేశ్-ప్రభుత్వ మాస పత్రిక)